# అత్తయ్య సన్నిధి..

కె.తాయారమ్మ





**ఈ వారం దెయ్యం కథ**

## విదేశాలలో ఆరేళ్ళు చదువు వెలగబెట్టిన తరువాత, ఇండియాలో నా చదువుకి తగిన ఉద్యోగం లభించింది.

బొంబాయిలో ఓ పెద్ద ఆఫీసులో మేనేజింగ్ డైరెక్టర్‌గా స్థిరపడ్డాను. ఎనిమిదివేల రూపాయల జీతం. అదొక వ్యాపారకేంద్రం. దానిమీద చాలా లాభాలు వస్తూ వుంటాయి.

"ఇంతవరకూ నేను ఒంటరిగాణ్ణి!" చాలా ఆఫర్స్ వస్తున్నాయి. కాని... కాని... ఎందుకో మనస్సు అంగీకరించడంలేదు! ఒక్కసారి నా అంతరంగంలో జనేలా మెదిలింది. "జనేలా అమెరికన్‌లేడీ!" నన్ను ప్రాణప్రదంగా ప్రేమించిన యువతి." కాని అప్పుడు మాట ఇవ్వలేకపోయాను!" దానికి కారణం...?

"కృష్ణప్రియ!"

"కృష్ణప్రియ మామయ్య కూతురు!"

అసలు నా బ్రతుకే మామయ్యతో ముడిపడివుంది తల్లిదండ్రులులేని నన్ను ఇంతవాణ్ణి చేసింది మామయ్యే మరి!

"మామయ్య ఒక్కగానొక్క కూతురు కృష్ణప్రియ! కృష్ణప్రియని నాకిచ్చిచేసి నన్ను తన ఇంట్లోనే వుంచుకోవాలని మామయ్య అభిప్రాయం.

అందుకే విదేశాలు పంపించి చదివించాడు.

కాని ఈ మధ్య ఓ గమ్మత్తు జరిగింది. మామయ్య ఒక్కగానొక్క కూతురు కృష్ణప్రియ తన మనసుకి నచ్చినవాడితో లేచిపోయింది. మామయ్య దృష్టిలో లేచిపోవడం. కాని కృష్ణప్రియది మాత్రం ప్రేమ! ఇది మామయ్యకి తీరని అవమానం కలిగించివుంటుంది.

కృష్ణప్రియది కులాంతర వివాహం!

"ఒరే చందూ చూశావా ఇదేం చేసిందో?" అంటూ ఉత్తరం రాశాడు మామయ్య.

చదువు పూర్తవుతున్నతరుణంలో అశనిపాతం లాంటి వార్త.

"మామయ్యా కృష్ణ ఏం తప్పుచేసింది? తన మనసుకి నచ్చిన మార్గాన్ని ఎన్నుకుంది!" అంటూ బదులు రాశాను!

"ఒరే ఇది నేను భరించలేకుండా వున్నాను!" "నువ్వు ఇండియావచ్చిన తరువాత నన్ను కలవడానికి ప్రయత్నించకు! నేను దేశాలుపట్టి పోతున్నాను!" మళ్ళీ రాశాడు మామయ్య.

"ఇండియా వచ్చానన్న ఆనందం మిగలలేదు!" చాలామంది ప్రముఖులు తమ పిల్లల్ని ఇస్తామంటూ రాసారు.

ఎందుకో మనస్సు అంగీకరించడంలేదు. మామయ్య కూతురు తప్పిపోయిందనికాదు! ఈ వాతావరణంలోని పిల్లల్ని చేసుకోవాలని లేదు! "అందునా హై సొసైటీలో పిల్లల్ని!" ఒక పల్లెటూరి పిల్లని, కల్లాకపటం తెలియని అమాయకురాల్ని!

నా ఆలోచన వింటే ఎవరైనా నవ్విపోతారు! "ఒక ఫారిన్ రిటర్న్‌డ్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడమా?" "నాన్సెన్స్!"

నా పెదాల మీద చిరుదరహాసం వెలిగింది.

**అమెరికాలో ఆరేళ్ళు గడిపాను! అప్పుడే బొంబాయి వచ్చి ఆరు నెలలయ్యింది. ఎక్కడ చూసినా బిజీ... బిజీ...! ఈ బిజీ లైఫ్‌తో విసుగెత్తి పోతోంది. "ఆంధ్రా వెళ్ళాలనిపిస్తోంది!" "అక్కడ ఓ పల్లెటూళ్ళో కొంతకాలం హాయిగా ప్రశాంతంగా**

గడిపితే బావుణ్ను!" "ఎక్కడ?".... ఎక్కడ?....

"అప్పుడు గుర్తొచ్చింది చూడమ్మత్తయ్య!" చూడమ్మత్తయ్య నాకు వేలు విడిచిన మేనత్తవుతుంది. ఆమెది అమృత హృదయం!

నెల రోజులు సెలవు తీసుకుని బయలు దేరాను!

చూడమ్మత్తయ్యది ఆంధ్రాలో ఓ చిన్న పల్లెటూరు. పేరు పద్మనాభం! అక్కడ దైవం అనంత పద్మనాభుడు. పెద్ద కొండ. చక్కటి దేవాలయం. మనస్సుకి ఉల్లాసం కలిగించే ఏరు.

ఆ దేవాలయానికి ఎదురుగా వుంది ఏరు. నాపరాళ్ల మీద ప్రవహించే ఆ ఏటిని చూస్తూ రోజులు రోజులే గడిపి వేయవచ్చు!

ఆ దేవాలయానికి ధర్మకర్తలూ పూజారులూ అందరూ కూడా చూడమ్మత్తయ్య తాలూకు వాళ్లే!

చూడమ్మత్తయ్య, మామగారు, బావగారు, భర్తగారు అందరూ కూడా స్వామి వారి కైంకర్యం చేసి తరించేరు. ఇప్పుడెవరూ లేరు.

అసలు చూడమ్మత్తయ్యకి సంతానమే లేదు. దూరపు బంధువులబ్బాయిని పెంచుకుంది. పేరు పాండురంగ. పాండురంగ పట్నాలలో చదువుకుంటున్నాడు. అసలు ఇలాంటి ఉద్యోగాలూ అవీ ఇష్టంలేనివాడు. ఏదో గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నాడు.

ఎన్నో విధాల నచ్చచెప్పింది చూడమ్మత్తయ్య. దేవాలయం తాలూకు వైభవాన్ని నిలబెట్టమని.

కాని పాండురంగ వినలేదు.

చూడమ్మత్తయ్య మాత్రం ఆ పల్లె విడిచి పెట్టలేదు.

"పద్మనాభం దగ్గర బస్సుదిగాను!" ఒకసారి నలువైపులా పరికించి చూసేను! అదేకొండ! "అదే ఏటికట్ట!" అవే సరుగుడు తోటలు! "ఎంత హాయి!"

చూడమ్మత్తయ్య ఇల్లు ఊరి చివరలో వుంది. అటువైపుగా నడిచాను! అవే వీధి అరుగులు, వీధి ముందర కొబ్బరిచెట్టు!

ఊళ్లో ఎవళ్లూ నన్ను పోల్చినట్టు లేదు. "ఇదీ ఒకందుకు మంచిదే!" "ఇప్పుడు నేను చాలా ఒడ్డూ పొడవుగా వున్నాను!"

మెల్లిగా తలుపు తోశాను.

తలుపులు తెరుచుకున్నాయి.

లోపలికి అడుగు పెట్టాను.

చేటలో వేరుసెనగకాయలు పోసుకు తింటున్న చూడమ్మత్తయ్య "ఎవరూ?" అంది.

"నేను అత్తయ్యా చందూని!" అన్నాను.

ఒక్క ఉదుటున లేచి నిలుచుంది చూడమ్మత్తయ్య. ఆనందోద్వేగంతో. "అబ్బీ బాగున్నావా?" "అమెరికానించి ఎప్పుడొచ్చావు?" కన్నులలో సంతోషం తొణికిసలాడు తుండగా ప్రశ్నల వర్షం కురిపించింది అత్తయ్య.

అత్తయ్య నన్ను పిలిచే పిలుపు అబ్బి!

"అబ్బీ దూరాలు పోయేవు!" "పెద్ద పెద్ద చదువులు చదివేవు!" ఇంకా ఈ బడుగు అత్తయ్య గుర్తుందా?" అత్తయ్య కన్నులలో సన్నని నీటి పొర కదలాడింది.

పెరట్లోకి నడిచాను కాళ్లు కడుక్కుందికి.

ఆ రాచ ఉసిరి చెట్టు, నారింజ చెట్టు, బాదం అన్నీ అలాగే వున్నాయి. చల్లని నీటితో ముఖం కడుక్కుని తేలికగా ఊపిరి తీసుకున్నాను.

రాచ ఉసిరిపప్పు, చిక్కుడుకాయ వేపుడు, కొరివి కారం, కమ్మటి నెయ్యి, గడ్డ పెరుగుతో ఒక గంటలో భోజనం వడ్డించింది చూడమ్మత్తయ్య.

"చూడమ్మత్తయ్య చేతి భోజనం నాకేం కొత్తకాదు." "చిన్నప్పుడు తరుచు పద్మనాభం వస్తూవుండే వాణ్ని!" మామయ్య అడ్డు చెప్పేవాడు కాదు.

"చూడమ్మత్తయ్యది అమృతహస్తం. మామిడి పింజలు ఆవలో ఊరబెట్టడం, నారింజ రసంలో పచ్చిమిరప కాయలు, మామిడల్లం ముక్కలు ఊరబెట్టడం. ఆమె హాబీ!" కుండలో చద్దెన్నం పోసి, "ఇవన్నీ పిల్లలకి పెట్టడం ఆమె హాబీ!" తనలాంటి బంధువుల పిల్లలు చూడమ్మత్తయ్య దగ్గర వుంటూవుండేవారు ఇదివరలో.

"అత్తయ్యా పాండురంగ ఎక్కడ వున్నాడు?" అన్నాను రాత్రి పక్కమీద నడుంవాలుస్తూ.

ఆరుబైట ఇద్దరం మంచాలు వాల్చుకు పడుకున్నాము.

అత్తయ్య విషాదంగా నవ్వింది. "ఒరే అబ్బీ కన్న బిడ్డలకే ఈ రోజులలో తల్లిదండ్రు లక్కరలేదు!" "ఇక పెంచుకున్న బిడ్డల సంగతి వేరే చెప్పాలా?" ఆస్తిపాస్తులన్నీ అమ్మేసి హైదరాబాద్ వెళ్ళిపోయాడు.


"ఇల్లు మాత్రం నాకు మిగిల్చాడు!" "దేవాలయ భూముల మీద పండిన గింజలు మాత్రం వస్తాయి!" "మిగిలినవన్నీ ప్రకృతి వరప్రసాదాలు!" అంది ఆకాశంలోకి చూస్తూ.

గాఢమైన నిట్టూర్పు వెలువడింది నానుండి.

"పాండురంగకి పిల్లలెందరు?" అన్నాను మళ్లీ.

"ఇద్దరు!" అనీ ఇంకేదైనా మాట్లాడు అబ్బీ! అంది అత్తయ్య ప్రసంగం మార్చే ఉద్దేశ్యంతో.

కొంతసేపు అమెరికా విశేషాలూ అవీ చెప్పి, నిద్రలోకి జారిపోయాను!



## డింపుల్ సన్నీ వియోగం

డింపుల్ – సన్నీ డియోల్‌లు వియోగం అనుభవిస్తున్నారు. ఒకళ్లనొకళ్లు చూసుకోవటానికిప్పుడు అవకాశం వుండటం లేదట! కారణం సన్నీ డియోల్ భార్య పూజా ఈ మధ్య గట్టి వార్నింగ్ యిచ్చింది – డింపుల్ కావాలో నేను కావాలో తేల్చుకోమని. పాపం సన్నీకి నోట్లో వెలక్కాయ పడ్డట్టయింది. డింపుల్‌ను చూడను గాక చూడనని భార్యకు ఒట్టేసాడట. నమ్మవచ్చా?

# కర్షకుడు కాని కర్షకుడు

వాడు కాడిని
మేడిని చూడని కర్షకుడు!
నాగలి కర్రు చూడని
నవీన హాలికుడు!
దున్నేభూమివాడిదే
వాడు దున్నడు
పండించిన పంట వాడిదే
వాడు పండించడు!
వాడి భూమి సరిహద్దులు



వాడికి తెలియవు
వేలవేల ఎకరాలు
విస్తరించిన వాడి భూమి
పాలేర్లు చూపాలి
పొలం హద్దులు చెప్పాలి!
రెండు చేతులే నీకు
సాయంత్రానికి అవి
వంద చేతులై శ్రమిస్తాయి!
పై తరగతి ప్రభువులు
పని చేయని చేతులు
శ్రమశక్తిని దోస్తాయి!
వాడికి అన్నం వుంది
ఆకలిలేదు
నీకు ఆకలి వుంది
అన్నంలేదు
మేల్కొన్నవాడు
నిన్ను మేల్కొనివ్వడు!
పోరాట దీపానికి
ప్రజలే చమురు
అందుకే ఆ దీపం
ఆరదులే ఎపుడూ!

—అడిగోపుల వెంకటరత్నమ్

మరునాడు ఉదయం సూర్యోదయం కాకముందే వేప పుల్ల నోట్లో పెట్టుకుని ఏటి వైపుగా నడిచాను! అప్పుడే చీకటి పొరలు కరిగి వెలుగు రేకలు పరచుకుంటున్నాయి.

ఎప్పుడూ టూత్ పేస్టు, బ్రష్‌లతో పళ్ళు తోముకోవడం బోర్. వేప పుల్లతో దంతధావనం ఒక థ్రిల్లింగ్.

ఏటి నీటిలో కాళ్ళు పెట్టుకుని ప్రకృతి దృశ్యాలు తిలకిస్తున్నాను.

ఇంతలో సన్నని గజ్జెల చప్పుడు. వెనుదిరిగి చూసేను! పద్దెనిమిది ఇరవై మధ్యగల వయస్సున్న అమ్మాయి. ఉషస్సు మధ్య విచ్చుకుంటున్న సంధ్యా రాగిణిలా వుంది.

"లేచి నిలుచున్నాను!"

బెదురు చూపులతో బిందె చంకన పెట్టుకుని నిలుచుంది. అదొక మనోజ్ఞదృశ్యం.

పలకరించా లనిపించింది. చాలా రోజులుగా ఆడా మగా తేడా తెలియకుండా మసిలే వాతావరణంలో వుంటున్నాను! ఇప్పుడీ దృశ్యం మనస్సుకి గిలిగింతలు పెట్టింది.

"మీరు.....?" అన్నాను మెల్లిగా...

నేను.... నే...ను... తడబడిందా అమ్మాయి.

చెప్పమన్నట్టు కనులతో నే సంజ్ఞ చేశాను.

"నేను... నేను... మ...నో...ర...మ!"

"అంటే కరణంగారి అమ్మాయి...?"

"అవును!" అన్నట్టు తల ఊపింది.

ఆడబోయిన తీర్థం ఎదురయ్యింది. నేను వెతుకుతున్న తీగె నా కాళ్ళకే తగిలింది.

"ఇదివరలో నేను చూసిన మనోరమ వేరు!" సన్నగా పొట్టిగా లంగా జాకెట్లతో వుండేది. కాని... ఇప్పుడు ఒక మనోజ్ఞతను సంతరించుకుని నా ఎదుట నిలుచుంది

"ఆలోచనల నుండి తేరుకునే సరికి ఎదుట మనోరమ లేదు!..

"చిన్నగా నవ్వుకుంటూ ఇంటికి నడిచాను!" అత్తయ్య కొబ్బరి మట్టలు పెట్టి నీళ్ళు కాస్తోంది.

"ఎందుకత్తయ్యా నీకీశ్రమ?" "ఏటి నీటిలో స్నానం చేసేవాణ్ణిగా!" అన్నాను.

"ఒరే ఈ నాలుగు రోజులూ నేను చెప్పినట్టు విను!" "తరువాత నీ ఇష్టం!" అంది కుంకుడు కాయలు పిసుకుతూ.

"నాకు తలంటి స్నానం చేయిస్తుందన్నమాట అత్తయ్య!" మరోసారి నా పెదాల మీద నవ్వు వెలిగింది.

అత్తయ్యా చేయించిన తలస్నానం, పెరుగు గారెలతో భోజనం, కంటినిండుగా కునుకు పట్టింది. నారింజ చెట్టు నీడలో మంచం వాల్చుకు పడుకున్నాను. సాయంత్రం ఆరుగంటలకి తెలివి వచ్చింది.

ఒరే అబ్బీ ఇదిగో "టీ" అంటూ తెచ్చింది చూడమ్మత్తయ్య.

చూడమ్మత్తయ్యా కాఫీ టీలు తాగక పోయినా తయారు చెయ్యడం మాత్రం బాగా చేస్తుంది.

ఎందుకో మళ్ళీ ఏటికట్ట దగ్గర కెళ్ళాలనిపించింది. "ఫ్రెష్ చేసుకుని బయలుదేరాను!"

"ఒరే అబ్బీ నువ్వు ఇక్కడికి వచ్చిన లాభం ఏమిటి?" అంటూ కసిరింది చూడమ్మత్తయ్యా. అది నేను ఆమె సాన్నిధ్యంలో ఎక్కువ సేపు వుండలేదన్న బాధ.

"ఇప్పుడే వచ్చేస్తాను!" అంటూ బయలుదేరాను!

సాయంసంధ్యా కాంతులు కరిగి చీకట్లు ముసురుకుంటున్నాయి.

సరుగుడు తోటల మధ్యనించి ఏటి వైపుగా వస్తోంది ఆమె. ఆమె.... ఆమె... ఆమె... ఎవరు? అదే మనోరమ! కాలిగజ్జెల చప్పుడే అందుకు సాక్ష్యం!

పలకరింపుగా నవ్విందామె.

"రెండుపూటలా వస్తారా?" అన్నాను.

తల ఊపింది వస్తానన్నట్టు!

"నేను నాలుగైదు రోజులే వుంటాననుకుంటోంది అత్తయ్య. కాని.... కాని... సెలవులన్నీ ఇక్కడే గడపడానికి నిశ్చయించుకున్నానని తెలిస్తే ఎంత పొంగి పోతుందో!"

"మీరు ఏం చదివారు?" మనోరమని సమీపిస్తూ ప్రశ్నించాను.

హైస్కూల్ మట్టుకే అంటూ నవ్వింది.

"చాలు! అనుకున్నాను!" అంతర్గతంగా.

రోజూ ఒక దినచర్య అయిపోయింది నాకు ఏటు ఒడ్డుకి వెళ్ళడం. మనోరమతో గంటలు గంటలు గడపడం మనస్సుకి ఏదో ఆహ్లాదాన్ని కలిగిస్తోంది.

మనోరమ నా ఎదుటే ఏటిలో స్నానం చేస్తూ వుండేది. ఇంత పసుపు ముద్ద పూసుకుంటూ వుండేది. పల్లెటూరి స్త్రీలు బాత్ రూమ్‌ల గురించి ఆలోచించరు! వారికది అలవాటే!

తడి బట్టతోటే నీళ్ళబిందె ఎత్తుకెళ్తూ వుండేది. ఆ శరీరంలోని ఒంపుసొంపులు ఏ శిల్పి చెక్కిన శిల్పంలాగో అనిపించేది నాకు.

రోజూ అనుకుంటున్నాను. మనోరమ విషయం అత్తయ్యతో చర్చించాలని. కాని అవకాశం చిక్కలేదు.

ఆ రాత్రి వీధి వసారాలో నవారు మంచం వాల్చుకు పడుకున్నాడు.

అమావాస్య రాత్రి.

చుక్కలు ఆకాశంలో నిక్కి పొడుచుకుంటున్నాయి. వాటిని లెక్కిస్తున్నాను. పనులు ముగించుకుని వచ్చింది అత్తయ్యా.

"ఒరే అబ్బీ పొద్దున్న సాయంత్రం ఏటికి పోతావు?" "నువ్వు ఎందుకొచ్చినట్టురా?" అంటూ నవ్వింది.

"అత్తయ్య బాధ నాకు తెలుసు!" "నేను అనుక్షణం ఆమె కళ్ళ ముందుండాలి!"

"అత్తయ్యా!" నెమ్మదిగా పిలిచాను.

"ఏరా అబ్బాయి?" అంది ఆవలించి చిటిక లేస్తూ.

ఆమెకు అప్పుడే నిద్ర వస్తున్నట్టుంది. అయినా అడగాలనుకున్నాను. "అత్తయ్యా... మనోరమ... చాలా మంచిపిల్ల!" అందమైనది కూడా...!

"ఎంత మంచిపిల్లయితే ఏం లాభం?" ఎంత అందగత్తె అయితే ఏం ప్రయోజనం?.....

"అంటే?"

"అంటే ఏమిట్రా అబ్బీ?" "వరకట్నం! వరకట్నం!" నిద్రాదేవి ఒడిలోకి జారిపోయింది అత్తయ్య.

ఒకటి రెండు సార్లు పిలిచి ఊరుకున్నాను. "అయితే మనోరమకి కట్నం మూలంగా పెళ్ళవలేదన్న మాట!" నిశ్చింతగా ఊపిరి తీసుకున్నాను.

మరునాడు ఉదయం ఎనిమిది గంటలకి తెలివి వచ్చింది. "అయ్యో!" "ఇవాళ ఏటికి వెళ్ళలేకపోయేను!" అనుకుంటూ లెచి కాలకృత్యాలు ముగించుకున్నాను.

ఏమీ తోచలేదు.

అలా కరణం మామయ్య గారింటి వైపు బయలుదేరాను! ఆయన వీధిలోనే దర్శనమిచ్చాడు. మధ్య పాపిట తీసి దువ్విన గిరజాల జుట్టు, నుదుట ఎర్రని పొడవాటి బొట్టు, నోట్లో పెద్దలంక పొగాకు చుట్ట, జరీకండువా, పంచె, రాజ్యాలు పోయినా లక్షణాలు పోలేదు కరణం మామయ్యకి. అల్లంత దూరం నించే పలకరించాడు. "ఏరా అబ్బాయ్ కులాసాయేనా?" "అమెరికా నుండి ఎప్పుడొచ్చావు?" "ఇంకా ఈ ఊరు, ఈ మనుష్యులు గుర్తున్నారా?" అని.

నేను నవ్వాను ప్రతిగా.

వీధి అరుగు మీద వున్న మరో కుర్చీ చూపించాడు మామయ్య.

ఎక్కడా మనోరమ జాడలేదు. "తండ్రి దగ్గర భయం కాబోలు!" నా చూపులు లోపలికి చొచ్చుకుపోతున్నాయి.

ఇంతలో ఎవరో పిలిస్తే అటు వైపుగా సాగిపోయాడు కరణం మామయ్య... "ఉండ్రా అబ్బాయ్ నేనొస్తాను!" అంటూ.

ఇదివరలో అయితే కాఫీ ఫలహారాలు పెట్టి పంపించేవాడు మామయ్య.

"బహుశా కాలమాన పరిస్థితులు కావచ్చు!"

నేను లేవడానికి, ఉద్యుక్తుడినయ్యాను!

ఇంతలో సన్నని గజ్జెల సవ్వడి. మనోరమ వస్తున్నట్టుంది. కాఫీ గ్లాసుతో ప్రత్యక్షమయి "వెళ్ళిపోతున్నారా?" అంది చిన్నగా.

"ఇంతసేపూ కనుపించలేదేం?" అన్నాను నవ్వుతూ.

నాన్న.... నా.... న్న... నసిగింది.

"ఓ! అదా సంగతి!" అని ముందుగా మా అత్తయ్యతో సంప్రదించి తరువాత మీ నాన్నగారితో మాట్లాడుతాను!

"దేన్ని గురించి?"

"మన పెళ్ళి గురించి!"

"పెళ్ళా?" మనోరమ ముఖంలో నీలినీడలు కదిలాడాయి.

"భయపడకు! నేను కట్నం అడగనులే!"

"మీకు కట్నం వద్దా?" పగలబడి నవ్వుతూ లోపలికి పారిపోయింది మనోరమ.

చిత్రంగా నవ్వుతూ చూశాను నేను.

కొంతసేపటికి ఇంటి దారి పట్టాను.

"ఎలాగైనా ఈ రోజు అత్తయ్యతో మనోరమ విషయం చర్చించాలి!" అనుకున్నాను.

"వీలైతే పెళ్ళి చేసుకుని మనోరమని వెంట పెట్టుకుని వెళ్ళొచ్చు!"

"అత్తయ్యా!" మెల్లిగా పిలిచాను.

అరిసెల పిండి దంపుతున్న అత్తయ్య "ఒచ్చేవా




అబ్బీ! వుండు వడ్డిస్తాను!" అంది.

"అత్తయ్యా కరణం మామయ్య బాగా చిక్కిపోయాడు సుమా!" అన్నాను అత్తయ్యకి ఎదురుగా రాతినేల మీద కూచుంటూ.

"చిక్కిపోడురా అబ్బీ!" వాడి బెంగంతా ఒక్కగానొక్క కూతురు మనోరమ మీదే!"

"ఇంక ఆ బెంగ అక్కరలేదు అత్తయ్యా! మనోరమని నేను చేసుకుంటాను!" "ఆ మాటలు నా గుండెలోనే ఆగిపోయాయి!" పెదవులు దాటి బైటికి రాలేదు.

"ఇది నా బలహీనతా?" "మరి అత్తయ్యతో ఎలా ప్రసంగించాలి?"

అత్తయ్య పెట్టిన కమ్మటి భోజనం తిని నారింజ చెట్టు నీడలో మంచం వాల్చుకు పడుకున్నాను.

"ఈ పల్లె జీవితం ఎంత హాయి!" రెండు పసుపు గోరలు నారింజ చెట్టు గుబురులో కూచుని ఊసులాడుకుంటున్నాయి. వడ్రంగిపిట్ట ఒకటి కొబ్బరిచెట్టుని ముక్కుతో పొడుస్తూ ఎంత శబ్దం చేస్తోంది.

ఎప్పటికో మాగన్నుగా నిద్ర పట్టింది.

నాలుగైదు రోజులు గడిచాయి. రెండు పూటలా ఏటికెళ్ళడం, మనోరమతో సరదాగా గడపడం, రాత్రిపూట వీధి వాకిట్లో పడుకుని అత్తయ్య చెప్పేదెయ్యాల కథలు, కాశీ మజిలీ కథలు వింటూ వుండడం, ఇంతకు మించిన ఆనందం ఎవరికి లభిస్తుంది?"

అత్తయ్య జ్ఞాని!—ఆమెకు తెలియని విషయాలు లేవు!" "అత్తయ్యా నువ్విప్పుడైతే ఏలాయర్వో, ఇంజనీర్వో అయి వుండేదానివి!" అంటూ వుంటాను నేను.

"చూడమ్మత్తయ్య అసలు పేరు చూడికుడుత్త నాంచియార్!" ఓసారి టీకాలు వేసేవాళ్ళు వచ్చి ఆ పేరు పలకడం రాక "సూరమ్మ" అని రాసేరు.

దాంతో అత్తయ్య నానా గొడవ చేసింది. వాళ్ళు నవ్వి ఊరుకున్నారు.

మరో రెండు మూడు రోజులు దొర్లాయి. అత్తయ్య నాకు కావలసినవన్నీ చేసి పెడుతూనే వుంది. నేను హాయిగా వున్నాను. ఎన్నిసార్లు నేను మనోరమ గురించి అడిగినా ఒకటి రెండు మాటలు చెప్పి దాటవేస్తోంది.

ఆ రోజు మధ్యాహ్నం నేను ఏదో పుస్తకం చదువుతూ నవారు మంచం మీద పడుకున్నాను. ఎవరో అంటున్నారు. "చూడమ్మ గారూ ఇది విన్నారా?" "మనోరమ భర్త మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడట!" అని. నేను త్రుళ్ళిపడి లేచి కూచున్నాను.

"మనోరమ వివాహితా?" "ఈ సంగతి అత్తయ్య చెప్పనే లేదు!"

"మగమహారాజు అతనికేమమ్మా!" "ఈ పిల్ల అతగాడు తెమ్మన్న కట్నం తేలేకపోయింది" అంటోంది అత్తయ్య.

మనస్సు చేదుగా అయిపోయింది.

నా ఆశలు అడియాశలై పోయాయి.

ఈ విషయం మనోరమకూడా నాతో చెప్పలేదు.ఒక కన్య పిల్లలాగే ప్రవర్తించింది నా సమక్షంలో.

నా మనసు వికలమయ్యింది. ఇంక ఒకటి రెండు రోజులలో నేను బొంబాయి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాను.

మరునాడు ఉదయం నేను నిద్ర లేచేసరికి అత్తయ్య ఎక్కడికో వెళ్ళడానికి సిద్ధపడుతోంది.

"అత్తయ్యా!" అని పిలిచాను నెమ్మదిగా.

"లేరా అబ్బీ!" ఫ్లాస్కులో కాఫీ వుంది తాగు.

"ఏటికి వెళ్తావేమో వెళ్ళిరా!" అంది.

"ఇవాళనించీ ఇంక నాకు ఏటితో సంబంధం ఏమిటి?" ఆ సంగతి అత్తయ్యకి తెలియదు.

"ఇంత ఉదయాన్నే ఎక్కడికి బయలుదేరావు అత్తయ్యా?" ప్రశ్నించాను!

"కరణం మామయ్యగారింటికి!"

"ఎందుకు?"

"పనులు సాయం చెయ్యడానికి!"

"పనులా? ఏం పనులు?"

"మనోరమ సంవత్సరీకాలుగా!" అంది.

"ఏమిటి?" కెవ్వున అరవబోయి; "అత్తయ్యా మనోరమ చనిపోయిందా?"

"నీకు తీలీదా అబ్బీ?" మనోరమని ఓ దుర్మార్గుడికిచ్చి చేశాడు కరణంమామయ్య. వాడు ఆ పిల్లని కట్నంతెమ్మని నానా హింసలు పెట్టాడు. చివరికి పుట్టింటికి దిగబెట్టాడు. మామయ్య ఆస్తి అంతా అమ్మి యిచ్చినా వాడికి చాలలేదు! భర్త పెట్టే బాధల్ని, అవమానాల్ని భరించలేక ఆ పిల్ల ఈ ఊరి ఏట్లో పడి ప్రాణాలు తీసుకుంది.

"మిగిలిన మాటలేవీ నాకు వినిపించలేదు!"

అత్తయ్యతో చెప్పకుండానే కాలికి బుద్ధి చెప్పాను.

## అత్తయ్య సన్నిధి

అంత ప్రేమను పంచి యిచ్చిన అత్తయ్య ఏమనుకుందో?

బొంబాయి వచ్చి ఆఫీసు వ్యవహారాలు చూస్తున్నా మనోరమ జ్ఞాపకాలు నన్ను విడిచిపెట్టలేదు. అవి నన్ను ఆశ్చర్యంలో ముంచి వేస్తూనే వున్నాయి. భయాన్ని కలిగిస్తూనే వున్నాయి.

ఆరునెలలు దొర్లిపోయాయి.

స్నేహితుడి పెళ్ళికి హైదరాబాద్ వెళ్ళాను. అక్కడ కనుపించాడు పాండురంగ. చూడమ్మత్తయ్య గురించి వాణ్ణి దులిపెయ్యాలనుకున్నాను.

"ఏరా చందూ, అమెరికా నుండి ఎప్పుడొచ్చావు?" అంటూ పలకరించాడు పాండురంగ.

వాడికి సమాధానం చెప్పి, "నీతో కొంతసేపు మాట్లాడాలి!" అన్నాను.

'అలాగే' అన్నాడు వాడు.

పెళ్ళి హడావిడి అయింతరువాత డాబా మీద ఒంటరిగా కనుపించాడు పాండురంగ.

ప్రేమమూర్తి అయిన అత్తయ్య నా అంతరంగంలో మెదిలింది. అలాంటి ఆమెని ఒంటిగా విడిచిపెట్టి ఆమె ఆస్తిపాస్తుల్ని అనుభవిస్తున్న పాండురంగని చూస్తూ వుంటే అసహ్యం కలిగింది నాలో.

"ఒరే అత్తయ్య ఆస్తి ఎంతుంటుంది?" అన్నాను సంభాషణలోనికి దిగుతూ.

సుమారు మూడు లక్షలుంటుంది.

"పిల్లలు లేని చూడమ్మత్తయ్య నిన్ను ఎందుకు పెంచుకుందనుకున్నావు?"

"ఒరే చందూ! నేనుగాని నన్ను కన్న తల్లిదండ్రులు కాని ఏనాడూ అమ్మ ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించలేదు. చిన్నప్పుడు అమ్మ నీలాంటి దూరపు బంధువుల పిల్లల్ని ఎందరినో ఇంట్లో వుంచుకుని వాళ్ళని సంరక్షిస్తూ వుండేది! అయినా నా వాళ్ళు అడ్డు చెప్పలేదు. ఆస్తి కరిగిపోతోందని బాధపడలేదు!"

"అప్పటి సంగతి కాదోయ్! ఇప్పటి సంగతి. ఆమె ఆస్తిపాస్తులన్నీ అమ్మేసి, ఆమెని ఒంటరిగా ఆ పల్లెలో విడిచి నువ్విలా పట్నాలు పట్టిపోతే ఆమె ఎంత బాధపడుతుంది?"

"చందూ!" గట్టిగా అరిచాడు పాండురంగ.

తక్కున ఆపాను నా వాగ్ధాటి.

తనను తాను సంభాళించుకుని అన్నాడు పాండురంగ, "చందూ ఇవన్నీ అమ్మ నీతో చెప్పుకు బాధపడిందా?"

"అవును!"

"ఎప్పుడు?"

"ఆరు నెలల క్రితం నేను పద్మనాభం వెళ్ళినప్పుడు!"

పాండురంగ కళ్ళు పత్తికాయలయినాయి.

ఇద్దరి మధ్యా మౌనం రాజ్యం చేస్తోంది.

నేను అత్తయ్య గురించి ఇలా ప్రశ్నిస్తానని ఊహించి వుండడు! "ఈ దెబ్బతో అత్తయ్య పాదాల మీద వాలిపోతాడు పాండురంగ."

మౌనాన్ని భంగపరుస్తూ "చందూ!" అని పిలిచాడు పాండురంగ.

కళ్ళతోనే ఏమిటన్నట్టు చూశాను.

"నీకు ఈ నిజం తెలుసా?"

"ఏ నిజం?"

"అమ్మ పోయి అయిదేళ్ళయింది!"

"ఆఁ!"

○

# శత్రుఘ్నసిన్హా ముఖ్యమంత్రి అవుతాడా?



బీహార్‌లో శత్రుకి మంచి పలుకుబడి ఉంది. పట్టుంది. కాదనం. కాని బీహార్‌లో ఎమ్. జి. ఆర్. లేదా ఎన్. టి. ఆర్. అవ్వగలడా ఈ పెద్ద మనిషి? ఈనెల ఎన్నికల్లో ముఖ్యమంత్రి పదవి ఈయన్ని వెదుక్కుంటూ వస్తుందేమో నన్నంత హడావుడి ఉందీ పెద్ద మనిషిలో ఇప్పుడు. ఈయన చెమ్చాలు ఏమన్నా, "నో... నో... ఐడోంట్ వాంట్ టు బి ఛీఫ్ మినిస్టర్"... అని అరుస్తున్నాడట. అందని ద్రాక్ష పుల్లన అన్న సామెత గుర్తొస్తోంది. అతిరథులూ మహారథులూ ముఖ్యమంత్రి కుర్చీ వైపు గద్దల్లా చూస్తూ కాచేసి ఉన్నారు. మధ్య ఈ కొత్త రెక్కల పక్షికెంత స్థానం ఉంది? చూడాల్సిందే!

-సుంకర